క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గణేష్‌నగర్, సత్యసాయినగర్, నరసింహనగర్, రైతుబజార్ ప్రాంతం, విద్యుత్ నగర్, లైట్ హౌస్ ఏరియా, పోర్ట్ ఇండోర్ స్టేడియం వెనుక వైపు పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

యూజీడీ ఇలా.. రాకపోకలెలా..?



యూజీడీ మ్యాన్‌హోల్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో యూజీడీల నిర్వహణ నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఇక్కడి పీ అండ్ టీ కాలనీ వసంతబాల పాఠశాల నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం రోడ్డులోని యూజీడీ మ్యాన్‌హోల్ చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి రోత పుట్టిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. నిత్యం పాదచారులు, వాహన చోదకులతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. యూజీడీ బ్లాక్ అవ్వడంతో మరమ్మతులు చేసిన సిబ్బంది ఎక్కడి వ్యర్థాలను అక్కడే వదిలేశారని మండిపడుతున్నారు. ఫలితంగా దుర్వాసన వెదజల్లడంతో ఇటు పాదచారులు.. అటు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికు లు కోరుతున్నారు.

హోరాహోరీగా 'వాల్తేరు క్రీడామేళా'

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్సా వాల్తేరు క్రీడామేళాలో భాగంగా క్యారమ్స్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాలు రెండింటిలోనూ ఈఎల్ఎస్‌తో సీనియర్ డీఈఈ విభాగం జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి. శుక్రవారం జరిగిన పురుషుల సెమీఫైనల్స్ పోటీల్లో ఎస్టీ జట్టుపై ఈఎల్ఎస్, కమర్షియల్ జట్టుపై సీనియర్ డీఈఈ జట్లు విజయం సాధించాయి. క్రికెట్ పోటీల్లో సీడబ్ల్యూ జట్టు చేసిన 118 పరుగులకు ప్రతిగా డీఎల్ఎస్ జట్టు మరో ఆరు వికెట్లు ఉండగానే విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ జట్టు చేసిన 177 పరుగులకు ప్రతిగా పర్సనల్ విభాగపు జట్టు 78 పరుగులకే ఆలౌటై పరాజయం పాలైంది. ఇంజినీరింగ్ జట్టు 137 పరుగులకు ప్రతిగా డీఎల్ఎస్ పద్ధతిలో ఓవర్లను కుదించగా, ఎలక్ట్రికల్ టీఆర్డీ జట్టు 70 పరుగులే చేసి ఓటమి చెందింది.

బ్రహ్మకుమారీల సేవలు ప్రశంసనీయం

సీతమ్మధార: ప్రపంచ వ్యాప్తంగా సమాజాభివృద్ధి కోసం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ కొనియాడారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు జర్నలిస్టుల కోసం ఇటువంటి సెమినార్లు నిర్వహించడం ఎంతో ఉపయుక్తమన్నారు. గౌరవ అతిథి మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఎంతో మంది విశాఖ వాసుల్లో ఆధ్యాత్మిక భక్తిభావాలు పెంపొందిస్తున్నారన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు బి.కె.రామేశ్వరి మాట్లాడుతూ సమాజం కోసం నిత్యం కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు భక్తిభావంతోపాటు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. రాజయోగా మెడిటేషన్ ద్వారా జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కొరియోగ్రాఫర్, సీనియర్ పాత్రికేయుడు ఆర్.నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, శాంతినగర్ శాఖ నిర్వాహకురాలు లలిత, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

దాదీ రతన్ మోహినికి నివాళులు

బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ దాదీ రతన్ మోహిని మృతి అత్యంత విచారకరమని అతిథులంతా సంతాపం వ్యక్తం చేశారు. దాదీ చిత్రపటం వద్ద దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులర్పించారు. సమాజానికి శాంతి, మానవతా విలువలతోపాటు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటిచెప్పిన రతన్ మోహిని ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు.



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో కానరాని గ్రీన్ షెల్టర్



ఊర్వశి కూడలి బస్టాప్‌లో..



బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నీరూ లేదు.. నీడా లేదు



ఐటీఐ జంక్షన్ బస్టాప్ వద్ద కానరాని చలివేంద్రం



ఇండస్ట్రియల్ ఎస్టేట్ బస్టాప్ వద్ద ఎండల్లో వేచి ఉన్న ప్రయాణికులు

మండుటెండలో అవస్థలు పడుతున్న జనం

జీవీఎంసీ జోన్–5లో కానరాని చలివేంద్రాలు, గ్రీన్ షెల్టర్లు

బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రయాణికులు, బాటసారుల పాట్లు

ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి

కంచరపాలెం: వేసవి తాపం జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎండలు భగభగ మండుతున్నా.. జీవీఎంసీ జోన్–5 పరిధిలో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు కానరాలేదు. మండుటెండలో తలదాచుకునేందుకు నీడ లేక.. దాహార్తిని తీర్చుకునేందుకు నీరు లేక స్థానిక ప్రజలు, బాటసారులు అవస్థలు పడుతున్నారు. జ్ఞానాపురం – కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలోని బస్టాప్‌ల్లో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అటువంటి చర్యలు చేపట్టలేదు. కంచరపాలెం, జ్ఞానాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాస, ఎన్ఏడీ కొత్త రోడ్డు, సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం, విశాఖ రైల్వే స్టేషన్, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లోని బస్ స్టాప్‌ల్లో గ్రీన్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండ వేడికి ఇబ్బందులు పడుతున్నారు.

నాడే నయం.. నేడు మాయం

గతంలో జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఎమ్యూనిటీ కార్యదర్శులు బస్‌స్టాప్‌లను ఆనుకుని గ్రీన్ షెల్టర్లు వేసి, వాటి పక్కనే తాటాకులతో నిర్మించిన పందిళ్లలో మట్టి కుండలతో తాగునీరు అందుబాటులో ఉంచేవారు. అటుగా వెళ్లే బాటసారులు, ప్రయాణికులు సేద తీరేందుకు గ్రీన్ షెల్టర్లు ఎంతగానో ఉపయోగపడేవి. చలివేంద్రాల ఏర్పాటుతో దాహార్తిని తీర్చుకునే వెసులుబాటు ఉండేది. నేడు అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని పలువురు పాదచారులు, ప్రయాణికులు వాపోతున్నారు. మండుటెండలో దాహార్తిని తీర్చుకునేందుకు కూల్ పాయింట్లను వెతుక్కునే పరిస్థితి నేడు కనిపిస్తోంది.

అధికారులు స్పందించాలి

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారులు నియోజకవర్గాల పరిధిలోని బస్‌స్టాప్‌ల్లో ఓటు వినియోగంపై అవగాహన బోర్డులు ఏర్పాటు చేసి చలివేంద్రాలు ప్రారంభించారు. అప్పుడు ఓటరుపై ఉన్న శ్రద్ధ.. ఇప్పుడు పాదచారులు, ప్రయాణికులపై కనిపించడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత జోనల్ అధికారులు స్పందించి అవసరమైన ప్రాంతాలు, బీఆర్‌టీఎస్ రహదారిలో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎండ తీవ్రతకు ఉండలేకపోతున్నాం

బస్సుల కోసం బస్ షెల్టర్లను ఆశ్రయిస్తున్నాం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రేకుల బస్ షెల్టర్లలో అధిక సమయం ఉండలేకపోతున్నాం. గతంలో గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు వాటి జాడ కనిపించడం లేదు. అధికారులు స్పందించి గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.
– బి.వసంత, ఐటీఐ జంక్షన్

కూల్ పాయింట్లను ఆశ్రయిస్తున్నాం

బస్ షెల్టర్లను ఆనుకుని జీవీఎంసీ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. వాటిని స్వచ్ఛంద సంస్థలు వినియోగించుకుని ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేసేవారు. నేడు అవి కనిపించడం లేదు. దాహార్తిని తీర్చుకునేందుకు కూల్ పాయింట్లను ఆశ్రయించాల్సి వస్తోంది.
– పి.నరేంద్రకుమార్, ఊర్వశి కూడలి

గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు అవసరం

కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలోని బస్‌స్టాప్‌ల్లో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వేసవి తాపం ఎక్కువగా ఉండటంతో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జోన్–5 అధికారులు దృష్టి సారించి గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.
– ఎస్.శంకర్, కంచరపాలెం

నేడు వైభవుడికి పంచామృతాభిషేకం



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి చైత్ర పూర్ణిమ సందర్భంగా శనివారం పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 6.45 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులతో మంగళధ్వని, వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదర్శన చేస్తారు. సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. పాలు, నెయ్యి, పంచదార, పెరుగు, తేనె, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సెపక్ తక్రా పోటీలకు జిల్లా వాసి ఎంపిక

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయి అండర్–17 'సెపక్ తక్రా'పోటీలకు ఏపీ జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బాలుర జట్టుకు విశాఖ జిల్లా నుంచి టి.జశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ నెల 15 నుంచి 21 వరకు మణిపుర్‌లోని ఇంఫాల్ శాయ్ సెంటర్లో పోటీలు జరగనున్నాయి. ఈ జట్లకు కోచ్‌గా ఎస్.రమేష్ (ఎన్టీఆర్), బాలికల జట్టు మేనేజర్‌గా ఎం.సంతోషి కుమారి (కర్నూలు), బాయ్స్ టీమ్ మేనేజర్ డి.సుంకర రావు (కర్నూలు) వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సమగ్ర శిక్షా ఎస్పీడీ అభినందిస్తూ.. విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం



శంకరమఠంలో అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న ఆదిమోహనరెడ్డి



అక్కయ్యపాలెంలో పూజలందుకున్న అయ్యప్ప

సీతంపేట: అయ్యప్ప స్వామి జన్మ దినోత్సవం, ఆరాట్టు సందర్భంగా పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు శుక్రవారం శంకరమఠంలో అయ్యప్పకు విశేష పూజలు నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు పైలా ఆదిమోహనరెడ్డి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, అయ్యప్ప స్వామి అఖండ సంకీర్తన నిర్విరామంగా 12 గంటల పాటు జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అయ్యప్ప శరణుగోష, గీతాలు ఆలపించారు.

➡ అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో శుక్రవారం అయ్యప్ప పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం భక్తులకు మజ్జిగ, పండ్లు, పులిహోర, మిఠాయి పంచిపెట్టారు. కార్యక్రమంలో భక్త బృందం వెంకటేష్, రమేష్, సంతోష్, నాగేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు

కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయం: కలెక్టర్ హరేందిర ప్రసాద్



విమ్స్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. విమ్స్ వార్షికోత్సవాన్ని శుక్రవారం విమ్స్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విమ్స్ నర్సింగ్, పరిపాలనా తదితర విభాగాలకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు సేవలందించడంలో కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయంగా విమ్స్ నిలుస్తుందన్నారు. ఇక్కడ ఓపీ గణనీయంగా పెరుగుతోందని, 19 విభాగాల నుంచి రోగులకు వైద్య సేవలు అందుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్రంలోనే మొదటిసారిగా కాలేయం మార్పిడి విమ్స్‌లో జరగడం విశేషమన్నారు. ఇలాంటి విశేషాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఆస్పత్రి అభివృద్ధితోపాటు జీవన్‌ధాన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. డైరెక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ విమ్స్‌లో అందుతున్న వైద్య సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ యూహెచ్ఎస్ రిటైర్డ్ వీసీ డాక్టర్ టి.రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యారాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, కేజీహెచ్ విశ్రాంతి సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, ఐటీసీఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఎ.ఆర్.వి.బద్రీనాథ్, విమ్స్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహంలో నిరాశ్రయులకు ఆశ్రయం



వసతి గృహంలో ఒడిశా మహిళ మెహతో



వసతి గృహంలో నాగేశ్వరరావు

సీతమ్మధార: ఒడిశాకు చెందిన సైమిత్ర మెహతో (35) మతిస్థిమితం లేని స్థితిలో విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను మహిళల వసతి గృహానికి తరలించారు. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటుంది. ప్రస్తుతానికి ఆమెను పరిశీలనలో ఉంచినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అభాగ్యుడికి ఆసరా..

మాచర్లకు చెందిన నాగేశ్వరరావు (45) లారీ క్లీనర్‌గా గతంలో పని చేసేవాడు. ఇతను అవివాహితుడు. ఒక ప్రమాదంలో కన్ను పోగొట్టుకున్నాడు. అప్పటి నుండి రోడ్ల మీద భిక్షాటన చేస్తూ తిరుగుతున్నాడు. జగదాంబ దగ్గర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి అతన్ని చూసి మహారాణిపేట పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు అతన్ని ఏయూటీడీ వసతి గృహానికి తరలించారు. ఈ రెస్క్యూలో ఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు బీహార్ వాసి

నలుగురు అన్నదమ్ముల్లో పెద్దవాడైన బీహార్ వాసి దశరథ్ (70) చెప్పుల దుకాణం నడుపుకుంటూ బతికేవాడు. అతను వ్యాధికి గురై రాంచీ ఆస్పత్రిలో చికిత్స పొందినా ప్రయోజనం లేకపోయింది. పిల్లలు చిన్నతనంలో ఉన్నప్పుడే వారిని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది 2019 సెప్టెంబర్‌లో గుర్తించి ఐదేళ్ల పాటు ఆశ్రయం కల్పించారు. పలుమార్లు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించడంతో కోలుకున్నాడు. శ్రద్ధా సహకారంతో అతన్ని బీహార్‌లోని రోహితాస్ జిల్లాలో గల దరిహత్ గ్రామంలో ఉంటున్న కొడుకు సంజయ్ కుమార్, కోడలు పూజితదేవిలకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

మార్గదర్శకుడు జ్యోతీరావు పూలే

మహాత్మా పూలే జయంతి వేడుకల్లో వక్తలు



పౌర గ్రంథాలయంలో పుస్తకం ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, సీతామహాలక్ష్మి, అతిథులు

సీతంపేట: దేశంలో ప్రథమ సామాజిక కార్యకర్త జ్యోతీరావు పూలే అని, సమ సమాజ స్థాపన కోసం ఆయన ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. సావిత్రిభాయి పూలే చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేకా చంద్రశేఖరరావు సంకలనపర్చిన 'సావిత్రిభాయి పూలే మార్గంలో సీతామహాలక్ష్మి' అనే పుస్తకాన్ని విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. డాక్టర్ కె.ఎస్.మల్లీశ్వరి పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు 'జ్యోతిబా పూలే సాహిత్యం'పై, జి.బేబిరాణి 'పూలే గులాంగిరి పరామర్శ'పై ప్రసంగించారు. అతిథులు, వక్తలు మాట్లాడుతూ జ్యోతీరావ్ పూలే మార్గంలో గూడూరు సీతామహాలక్ష్మి పయనిస్తూ శరీర, అవయవ దానంపై సామాజిక చైతన్యం తీసుకొస్తున్నారని కొనియాడారు. పూలే ఆశయ సాధనే లక్ష్యంగా సావిత్రిభాయి పూలే ట్రస్టును స్థాపించి ఎంతో మంది పేద పిల్లలకు విద్యనందిస్తున్నారని ప్రశంసించారు. మరణించాక కూడా బతికుండాలన్న లక్ష్యంతో అఖిల భారత శరీర దాతల సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అభాగ్యులకు అవయవాలు అందేలా సీతామహాలక్ష్మి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం నిరుపేద వైద్య, నర్సింగ్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

➡ సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారా నాగేశ్వరరావు, మత్రివేముల శ్రీనివాస్, కోసూరు శ్రీనివాస్, పోతు ప్రసాద్, శ్రీధర్, పిల్లి పరదేసి పాల్గొన్నారు.

జ్యోతిబా పూలేకు ఘన నివాళి

సీతమ్మధార: దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని జ్యోతిబా పూలే విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఈపీడీసీఎల్ కార్యాలయంలో జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



మహాత్మా పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

➡ బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ ఉత్తర కార్యాలయంలో జ్యోతీరావు పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి పూలే దంపతులు విశేష కృషి చేశారని ఆయన కొనియాడారు.

సరోగసీ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

మహారాణిపేట: సరోగసీ, ఏఆర్‌టీ (సహాయక పునరుత్పత్తి సాంకేతిక) కోసం చేసుకున్న దరఖాస్తులను తనిఖీ చేయడంతో పాటు అక్కడ మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఆర్‌టీ, సరోగసీ చట్టంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పలు ఆస్పత్రులు సరోగసీ కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వీటిని పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఏఆర్‌టీ లెవల్–1, నోవా ఐవీఎఫ్ కేంద్రం ఏఆర్‌టీ లెవల్–2, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రం ఏఆర్‌టీ లెవల్–2 కోసం దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, పలు విభాగాల అధికారులు ఎల్.వి.రమణి, బి.నాగేశ్వరరావు, నారాయణరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ కార్ల పార్కింగ్‌తో ఇక్కట్లు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మెయిన్ రోడ్డు మీద పార్క్‌చేసిన కార్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపవుతున్నాయి. ఇక్కడి అభయాంజనేయ స్వామి గుడి జంక్షన్ దరి షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట, దుకాణాల వద్ద ఇష్టానుసారంగా వాహనాలు పార్క్‌చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ట్రావెల్స్ దుకాణాలను ఆనుకుని మెయిన్ రోడ్డు మీదే కార్లు వరుసగా పార్కింగ్ చేయడం గమనార్హం. ట్రావెల్స్ కార్ల రాకపోకల సమయంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు, వాహనచోదకులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలోని కార్యాలయాలు, దుకాణాలు, బ్యాంకులకు వచ్చే వినియోగదారులు రోడ్డు మీదే వాహనాలు నిలుపుతున్నారు. ఇటువైపు పాఠశాల విద్యార్థులతో వెళ్లే ఆటోలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. తరచూ ట్రాఫిక్ జామ్ కారణంగా విద్యార్థులు, ఉదయం పాఠశాలలకు, సాయంత్రం ఇళ్లకు వెళ్లడం ఆలస్యమవుతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ బీట్ సైతం లేదు. దీంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు, పాదచారులు మండిపడుతున్నారు. ద్వారకా ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమన్వయంతోనే డ్రగ్స్ రవాణాకు చెక్



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోతో పాటు అన్ని సంబంధిత శాఖలు, ప్రైవేట్ ఏజెన్సీల సమన్వయంతోనే డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో పార్సిల్, కొరియర్, పలు రకాల ఈ–కామర్స్ సంస్థల ప్రతినిధులతో ఎన్‌సీబీ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తన నంబర్ 7995095799కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పార్సిల్స్, కొరియర్, ఈ–కామర్స్ ద్వారా నార్కోటిక్ డ్రగ్స్ రవాణా జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎన్‌సీబీ అధికారులు వివరించారు. రవాణా అవుతున్న పార్సిళ్లలో నార్కోటిక్ డ్రగ్స్ ఉంటే ఎలా గుర్తించాలి, ఎవరైనా డ్రగ్స్ రవాణా చేసేందుకు ప్రయత్నిస్తే సమాచారం పోలీసులకు ఎలా అందజేయాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు.